నిరుపయోగంగా వ్యవసాయ గిడ్డంగి

- రూ.24.60 లక్షల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు

తాడిపత్రి రూరల్: 2014 నుంచి 2018 వరకూ అప్పటి టీడీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడానికి ప్రజాధనం లక్షలాది రూపాయలను ధారపోసింది. ప్రధానంగా మండలానికి ఒక వ్యవసాయ గిడ్డంగి పేరుతో రూ.24.60లక్షలు ఖర్చు చేసింది. ఖరీఫ్, రబీ సీజన్‌లో వచ్చే వేరుశనగ, కంది, పప్పుశనగ, జొన్న తదితర పంటలకు సంబంధించిన సబ్సిడీ విత్తనాల నిల్వ కోసం అప్పట్లో మండలానికి ఒకటి చొప్పున గిడ్డంగులను మంజూరు చేశారు. అప్పట్లో గిడ్డంగులను టీడీపీ సానుభూతిపరులు నిర్మించారు. నిర్మాణంలో కూడా నాణ్యతను పాటించలేదన్న ఆరోపణలున్నాయి. తాడిపత్రి మండలానికి సంబంధించి పట్టణంలోని వ్యవసాయ కార్యాలయ ఆవరణలో ఒక వ్యవసాయ గిడ్డంగి నిర్మించారు. 2017 జనవరి 27న నిర్మాణ పనులకు ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేసి, 2018 మే 2న వ్యవసాయ గిడ్డంగిని ప్రారంభించారు.


కంపచెట్ల మధ్యలో నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ గిడ్డంగి

ప్రారంభానికే పరిమితం

వ్యవసాయ గిడ్డంగి ప్రారంభానికి మాత్రమే పరిమితమైంది. ఈ గిడ్డంగిని అధికారులు ఉపయోగించుకోలేదు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో రైతులకు వివిధ రకాల విత్తనాలను సబ్సిడీ రూపంలో రైతులకు పంపిణీ చేసింది. అయినా లక్షలాది రూపాయలు వ్యయం చేసిన మండల వ్యవసాయ గిడ్డంగిని ఉపయోగించుకోవడం లేదు. వ్యవసాయ కార్యాలయం ఆవరణలో వ్యవసాయ గిడ్డంగి ఉందన్న ఆలోచన కూడా అధికారులకు రాకపోవడం గమనార్హం. అధికారుల నిలువెత్తు సాక్ష్యానికి నిదర్శనంలా నేడు గిడ్డంగి దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. గిడ్డంగి లోపలి భాగం చెత్త చెదారంలో నిండిపోయింది. అప్పట్లో భద్రపరిచిన రికార్డులు, పత్రాలు తదితర వాటిని పట్టించుకోక పోవడంతో దుమ్ము కొట్టుకుపోయాయి. గిడ్డంగి చుట్టూ ముళ్లకంపలు పెరిగి విష పురుగులకు నిలయంగా మారాయి. ముళ్లకంపలను తొలగించకపోవడంతో పక్కన ఉన్న తాడిపత్రి వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. నిధుల లేమి పేరుతో ముళ్లకంపలను కొట్టివేయడంలో జాప్యం జరుగుతోందని సిబ్బంది చేపుతున్నారు.ముళ్లకంపలను తొలగించి నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ గిడ్డంగిని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.


గిడ్డంగి లోపల దుమ్ముపట్టిన రికార్డులు

వినియోగంలోకి తీసుకురావాలి



తాడిపత్రి వ్యవసాయ కార్యాలం ఆవరణలో నిరుపయోగంగా ఉన్న గిడ్డంగిని వినియోగంలోకి తీసుకు రావాలి. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన గిడ్డంగి దాదాపు ఆరు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంది. అధికారులు వినియోగించుకోక పోవడంతో లక్షలాది రూపాయలు వృథా అయ్యాయి.
– రంగయ్య, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

గిడ్డంగి పేరుతో ప్రజాధనం వృథా



రైతుల అవసరాల పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చుచేసి కట్టించిన వ్యవసాయ గిడ్డంగి నిరుపయోగంగా మారింది. అప్పట్లో గిడ్డంగి నిర్మాణం వల్ల కాంట్రాక్టర్‌కు లాభం చేకూరింది తప్ప రైతులకు మేలు జరగలేదు. ప్రారంభానికే పరిమితమైన గిడ్డంగిని అధికారులు ఉపయోగంలోకి తీసుకురావాలి.
– రాజారామిరెడ్డి, రైతు సంఘం నాయకుడు

ఉపయోగంలోకి తెస్తాం



మండల వ్యవసాయ గిడ్డంగిని ప్రభుత్వ స్కీంలు వచ్చినపుడు ఉపయోగంలోకి తీసుకువస్తాం. గతంలో ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతుల కోసం మంజూరు చేసే సబ్సిడీ విత్తనాల నిల్వ కోసం గిడ్డంగిని నిర్మించారు. ప్రస్తుతం గిడ్డంగి అవసరం లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. భవిష్యత్ అవసరాల కోసం ఉపయోగంలోకి తీసుకువస్తాం. – చెంగళరాయుడు, వ్యవసాయశాఖ ఏడీ

క్లుప్తంగా

రెడ్డి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, డాక్టర్ సరోజమ్మ

గుంతకల్లుటౌన్: రెడ్డి సంక్షేమ సంఘం 2025 సంవత్సర క్యాలెండర్‌ను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, డాక్టర్ సరోజమ్మ ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక చైతన్య థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రెడ్డి కులస్తులు ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాధా, అశోక్‌రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు తిరుమలరెడ్డి, రంగారెడ్డి, మల్లారెడ్డి, కోశాధికారి నీలకంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి


దివ్యాంగులకు ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న ఎంవీఐ, సీఐ

గుంతకల్లుటౌన్: ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని ఎంవీఐ రాజాబాబు, వన్‌టౌన్ సీఐ మనోహర్ సూచించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పాతబస్టాండ్ పోలేరమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 450 మంది దివ్యాంగులకు మేస్త్రీ దొడ్డప్ప ప్లేట్లు, గ్లాసులు కొంత నగదును అందజేయడంతో పాటు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. పోలేరమ్మ ఆలయ అభివృద్ధితో పాటు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న దొడ్డప్పను జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, ఇతర ప్రముఖులు సత్కరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్, రూరల్, కసాపురం ఎస్‌ఐలు కొండయ్య, రాఘవేంద్ర, వెంకటస్వామి పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడికి సన్మానం


కళాకారుడు గుమ్మడి గోపాలకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని స్వరరాగ నాటక కళా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ రంగస్థల కళాకారుడు, ఏపీ రాష్ట్ర తెలుగు పౌరాణిక రంగస్థల అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని లలిత కళాపరిషత్‌లో ఆ పరిషత్ ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి 6వ వర్ధంతిలో భాగంగా శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటక ప్రదర్శన గావించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన అందులో శ్రీకృష్ణుని పాత్రను పోషించి అందరినీ రంజింపజేశారు. ఈసందర్భంగా ఆయనను స్వరరాగ నాటక కళాసమితి సాదరంగా స్థానిక కళాసమితి ఉచిత శిక్షణాలయానికి ఆహ్వానించి, సత్కారం చేశారు. కార్యక్రమంలో ఆ కళాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరాజు, సభ్యులు పుంజా కృష్ణారావు యాదవ్, సుబ్రమణ్యం, ఓబులేసు, రమణమూర్తి, నాగార్జున, చెన్నప్ప, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవి నాగమునికి సత్కారం


నాగమునిని సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో గుత్తికి చెందిన కవి, విద్యుత్ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నాగమునిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌తో పాటు నిర్వాహకులు ఆయనను సత్కరించి, మెమెంటో అందజేశారు.

జూదరుల అరెస్టు


జూదరుల అరెస్టు చూపుతున్న పోలీసులు

తాడిపత్రి రూరల్: మండలంలోని ఊరుచింతల గ్రామ సమీపంలో శనివారం ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.48వేలు స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ ధరణీబాబు, సిబ్బంది కలసి దాడులు చేశారన్నారు. తాడిపత్రికి చెందిన సోమశేఖర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, సతీష్‌కుమార్, రామాంజనేయులు, ఊరుచింతల వసువర్ధన్‌రెడ్డిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశామన్నారు

అమిత్ షా రాజీనామా చేయాలి


మాట్లాడుతున్న సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

గుత్తి: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆదివారం సీపీఎం, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, బీఎస్పీ నాయకులు విజయ్, మాల సంఘం నాయకుడు రామాంజనేయులు, కేవీపీఎస్ నాయకుడు మల్లికార్జున, సీపీఎం నాయకుడు రామకృష్ణ , ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ తదితరులు మాట్లాడారు. హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను కించ పరిచే విధంగా వ్యాఖ్యానించారన్నారు. వెంటనే భేషరతుగా క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. క్షమాపణలు చెప్పకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా సీపీఐ శత వార్షిక వేడుకలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జగదీష్, జాఫర్ తదితరులు

గుత్తి: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ మండల కార్యదర్శి రామదాసు ఆధ్వర్యంలో సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, గోవిందు నాయకులు సూర్యనారాయణ రెడ్డి, రాజు, మధు, రమేష్, డోలక్ షఫి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండా, శత వార్షికోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ కార్యాలయం వద్ద నుంచి గాంధీ సర్కిల్ , ఆర్టీసీ బస్టాండ్ మీదగా రాయల్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో జరిగిన సభలో జగదీష్, జాఫర్ మాట్లాడారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ ఉద్యమాలు, పోరాటాలకు కేరాఫ్ అడ్రస్ అన్నారు. ప్రజా, కార్మిక, కర్షక, రైతు సమస్యల పరిష్కారం కోసం పలు ఉద్యమాలు చేసిందన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గుంతకల్లుటౌన్: నాలుగున్నర దశాబ్దాల క్రితం విద్యాబుద్ధులు నేర్చుకుని జీవితంలో ఉద్యోగాల్లో ఉన్నతస్థానాలకు చేరిన వారంతా తిరిగి చదువులమ్మ చెట్టు గూటికి చేరారు. గత కాలపు స్మృతులు, మధురానుభూతులను నెమరువేసుకోవడమే కాకుండా విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1980–83 బ్యాచ్‌కు చెందిన డిగ్రీ బీజెడీసీ విద్యార్థులు ఆదివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఓబులేసు, నిర్వాహకులు గౌరీశంకర్, శ్రీనివాసులు, మహబూబ్‌బాషా, షేక్షావలి, సుంకన్న, మనోహర్, నాగమ్మ, విజయలక్ష్మి, సుచితాకుమారి, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

‘కోటంక’లో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, ఆకుపూజ, అర్చనలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యర్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థనారాయణస్వామిని ధనుర్మాసం చివరి ఆదివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు అర్చకులు ఆలయ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఎఫ్‌సీఐ గోడౌన్‌లను వినియోగించుకోవాలి

గుంతకల్లుటౌన్: ధాన్యం నిల్వలకు పట్టణంలో ఉన్న అతిపెద్ద ఎఫ్‌సీఐ గోడౌన్‌లను రాష్ట్ర పౌరసరఫరా శాఖ వారు వినియోగించుకోవాలని ఎఫ్‌సీఐ రాష్ట్ర కన్సల్టేటివ్ కమిటీ డైరెక్టర్ వి.విజయలక్ష్మి సూచించారు. ఆదివారం ఆమె తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎఫ్‌సీఐ గోడౌన్లలోని సమస్యలను కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి దృష్టి తీసుకెళ్లగా ఆయన స్పందించి రాష్ట్ర ఎఫ్‌సీఐ అధికారులకు తగు సూచనలు చేశారన్నారు. గుంతకల్లు పరిసరాల్లోని ప్రైవేట్ గోడౌన్లను వినియోగించడం వల్ల సంబంధిత కాంట్రాక్టర్లకు లబ్ధిచేకూరడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. ప్రైవేట్ గోడౌన్ల కాంట్రాక్టర్లు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్న విషయాన్ని రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి కూడా తీసుకెళ్లానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

టవర్ల నిర్మాణంలో నిర్లక్ష్యం.. రైతులకు నష్టం


పనులు చేస్తుండడంతో దెబ్బతిన్న పప్పుశనగ పంట

పుట్లూరు: అనంతపురం-వైఎస్సార్ జిల్లాల మధ్య పొలాల్లో టవర్ల నిర్మాణం కోసం చేపడుతున్న పనుల్లో పవర్‌గ్రిడ్ అధికారుల నిర్లక్ష్యం రైతులకు తీవ్ర నష్టాన్ని కల్గిస్తోంది. మండలంలోని కందికాపుల, పుట్లూరు, శనగలగూడూరు, తక్కళ్లపల్లి తదితర గ్రామాల మీదుగా పొలాల్లో విద్యుత్ టవర్ల నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం పప్పుశనగ పంట సాగులో ఉన్నప్పటికీ.. అన్నదాతలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా టవర్ల నిర్మాణం కోసం పంటలను నాశనం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. టవర్ల నిర్మాణం కోసం ఎంపిక చేసిన పొలాల్లో కాకుండా పక్కనే ఉన్న పొలాల్లో వాహనాలు, భారీ తాళ్లను లాగడం వల్ల నష్టం జరిగినట్లు రైతు నారాయణరెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశాడు.

మిడ్ పెన్నార్ డ్యాంలో నేడు చేప పిల్లల విడుదల

గార్లదిన్నె: మండలంలోని మిడ్‌పెన్నార్ డ్యాంలోకి సోమవారం 12 లక్షల చేప పిల్లలు విడుదల చేస్తున్నట్లు ఫిషరీష్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆసీఫ్ తెలిపారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ మిషన్ ఫింగర్లింగ్స్ కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా చేప పిల్లలు వదులుతున్నామన్నారు. కార్యక్రమానికి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి హాజరవుతారన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

యల్లనూరు: మండలంలోని కల్లూరు- దుగ్గుపల్లి గ్రామాల నడుమ పెద్దమ్మతల్లి ఆలయ ఆరో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వృషభాల యజమానులకు బహుమతులు ప్రదానం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి బహుమతి రూ.50 వేలతో పాటు వరుసగా తొమ్మిది బహుమతులను ప్రదానం చేశారు. సాయంత్రం చెక్క భజన పోటీలు నిర్వహించారు.

బైకును ఢీకొన్న కారు



కొండాపురం: వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలం వెంకటాపురం సాయిబాబా గుడి సమీపంలో తాడిపత్రి-కడప జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం సూరేపల్లికి చెందిన అశోక్, ప్రణయ్, రాము ఆదివారం ద్విచక్ర వాహనంలో వెళుతుండగా వెంకటాపురం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ముగ్గురికీ కాళ్లు విరిగాయి. క్షతగాత్రులను 108 వాహనంలో తాడిపత్రిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు.

‘ఈ-కేవైసీ చేయించుకోవాలి’

గార్లదిన్నె: మండల కేంద్రంలోని జంబులదిన్నె సొసైటీ సంఘాల సభ్యులు ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి సూచించారు.ఆదివారం ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకమైన పీఏసీఎస్ కంప్యూటరైజేషన్ లో భాగంగా రికార్డులలో ఈ-కేవైసీ వివరాలను నవీకరించడానికి మిషన్ మోడల్ డ్రైవ్ చేపడుతామన్నారు. సహకార సంఘాల్లోని సభ్యులంతా గ్రామ సచివాలయాల్లో ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు.

శభాష్ మధు!

- మొదటి షార్ట్ ఫిలింలోనే ప్రతిభచూపిన యువకుడు


అవార్డ్ అందుకుంటున్న మధు

నార్పల: మండలంలోని హెచ్.సోదనపల్లి గ్రామానికి చెందిన పెద్దన్న కుమారుడు మధుకు అనంతపురం కంటెంట్ ఆఫ్ క్రియేటర్ అవార్డ్ 2024 వరించింది. ఈ అవార్డ్‌ను ఫ్రాక్స్ ఆర్గనైజర్ ముదార్ సుధీర్ చేతుల మీదుగా ఆదివారం జిల్లా కేంద్రంలో అందుకున్నారు. వివరాలు మధుకు చిన్ననాటి నుంచి సినిమాలంటే మక్కువ. ఇంటర్ పూర్తవగానే హైదరాబాద్‌కు వెళ్లి నాలుగు సంవత్సరాలు యానిమేషన్ కోర్స్ చదివాడు.ఆ తరువాత సినిమా తీయాలనే మక్కువతో రామ్ అనే ఓ షార్ట్ ఫిలీం తీసి జిల్లా కేంద్రంలోని ఎస్‌మ్యాక్స్ నీలిమా సినిమా హాల్‌లో విడుదల చేశారు. ఆ చిత్రం మంచి ఆదరణ పొందడంతో అనంతపురం కంటెంట్ ఆఫ్ క్రియేటర్ అవార్డ్ 2024 అందుకున్నారు. అవార్డ్ రావడం ఎంతో గర్వంగా ఉందని భవిష్యత్‌లో మరిన్ని చిత్రాలు తీస్తానని మధు తెలిపారు. తదిపరి ప్రాజెక్టుకు ఆడిషన్స్ తొందర్లో నిర్వహిస్తానని, నటనతో పాటు ఇతర విభాగాల్లో ఆసక్తి ఉన్న వారు 6305679191 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

‘దళితులపై కుట్రలు మానాలి’

పామిడి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎస్సీ కులాల సోషల్ ఆడిట్ డిస్ప్లే లిస్టులో చాలామంది మాదిగలు, ఉపకులాలను సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి క్రిస్టియన్లుగా పరిగణిస్తూ బీసీ–సీ కింద నమోదు చేయడాన్ని దళిత సంఘాల నేతలు తప్పుబట్టారు. ఆదివారం ఐక్య మాదిగ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న, సీనియర్ నాయకులు కుమార్ మాట్లాడారు. కొందరు కుట్రదారులు కుట్రపన్ని మాదిగలు, ఉపకులాలకు సమానత్వ న్యాయం లేకుండా కమిషన్‌కు నివేదించడాన్ని గుర్తించి, ఫిర్యాదు చేయడానికి మాదిగలు చైతన్యవంతులు కావాలని వారు కోరారు.

వెండి గొడుగు వితరణ


అర్చకుడికి వెండిగొడుగు అందజేస్తున్న దాత కేశన్న

పెద్దపప్పూరు: మండలంలోని కుమ్మెత గ్రామంలోని చెన్నకేశవస్వామికి ధనుర్మాసం చివరిరోజు సందర్భంగా ముదిగుబ్బ మండలం కమ్మవారిపల్లికి చెందిన కేశన్న అనే భక్తుడు 20 తులాల వెండి గొడుగును వితరణ చేశాడు. కార్యక్రమంలో అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం


ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చిలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్‌ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. కుటుంబ బలహీనతలు, ఇబ్బందులు, కష్టాలు, రుగ్మతల నుంచి కాపాడువాడు దేవుడు ఒక్కడే అన్నారు. అతడు పొందిన దెబ్బల చేతనే మనకు స్వస్థత కలుగుతోందన్నారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడు మన జీవితాలు ధన్యకరమవుతాయన్నారు. ఈసందర్భంగా దైవ సంకీర్తనాలాపనల నడుమ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సంఘ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

డీజిల్‌షెడ్ ఉద్యోగులకు జీఎం అవార్డు


మనోజ్‌కుమార్


మల్లికార్జున

గుత్తి: గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌లో పనిచేసే ఇద్దరు ఉద్యోగులకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్(జీఎం) అవార్డు దక్కింది. ఆఫీస్ సూపరిండెంట్‌గా పని చేస్తున్న మల్లికార్జున, సీనియర్ సెక్షన్ ఇంజనీర్‌గా పని చేస్తున్న మనోజ్ కుమార్ జీఎం అవార్డుకు ఎంపికయ్యారు. జనవరి 3న సికిందరాబాద్‌లో జీఎం చేతుల మీదగా వారు అవార్డు అందుకోనున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

గుంతకల్లుటౌన్: స్థానిక రైల్వేస్టేషన్ బయట అనారోగ్యంతో మృతిచెందిన ఓ అనాథ మృతదేహానికి ఆ నలుగురు సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటారు. ఆదివారం వన్‌టౌన్ పోలీసుల విజ్ఞప్తి మేరకు ఆ నలుగురు సేవా సమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్, సమితి సభ్యులు క్రిష్ణమూర్తి, రవీంద్ర, వేణు,రాజప్ప, అంజలి, స్నేహ, నవీన్, ప్రవీణ్ తదితరులు వృద్ధుడి మృతదేహాన్ని పాతగుంతకల్లులోని హిందూ శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు చేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

గుత్తి: పట్టణంలోని బాలికల వసతి గృహంలో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ ఆధ్వర్యంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు జెండాను ఆవిష్కరించారు.ఎస్‌ఎఫ్‌ఐ చరిత్ర, గొప్పతనం గురించి రమేష్ వివరించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నవీన్ యాదవ్, షేక్షావలి, రాజు, వాసు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.